క్లుప్తంగా

కుంతీదేవి ఊరేగింపు

ద్వారకాతిరుమల: క్షేత్ర పురవీధుల్లో కుంతీదేవి అమ్మవారి ఊరేగింపు పుష్ప వాహనంలో సోమవారం అట్టహాసంగా జరిగింది. ముందుగా స్థానిక ఎస్సీ కాలనీలోని రామాలయంలో ఉన్న అమ్మవారి ఉత్సవ మూర్తులకు కమిటీ సభ్యులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తులను పుష్ప వాహనంలో తీన్మార్ డప్పువాయిద్యాలు, శక్తి వేషధారణల నడుమ ఊరేగింపు నిర్వహించారు. రాత్రి పంగిడిగూడెంలోని పోలవరం కాలువలో నిమజ్జనం చేశారు.

నేడు ఎమ్మెల్యే బాలరాజు పర్యటన

బుట్టాయగూడెం: ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మంగళవారం బుట్టాయగూడెంలో పర్యటించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన రైతు భరోసా పథకంలో చెక్‌లు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని చెప్పారు.

నేడు పొగాకు సాగుపై సమావేశం

కొయ్యలగూడెం: ఎన్ఎల్ఎస్ పరిధిలోని వర్జినియా పొగాకు సాగుపై మంగళవారం కొయ్యలగూడెం పొగాకు వేలం కేంద్రంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు వేలం నిర్వహణ అధికారి గ్రేసీ మార్గరెట్ పేర్కొన్నారు. ఉత్తమ యాజమాన్య పద్ధతులపై నిర్వహించే ఈ సదస్సుకు రీజనల్ మేనేజర్ ఆదిశేషయ్య, బోర్డు మేనేజర్ దామోదరం, సీటీఆర్ఐ శాస్త్రవేత్తలతో పాటు ఐటీసీ ప్రతినిధులు హాజరవుతారన్నారు.

దంచికొట్టిన వాన

బుట్టాయగూడెం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా సోమవారం సాయంత్రం బుట్టాయగూడెంలో వాన దంచికొట్టింది. ఒక్కసారిగా కారుమబ్బులు కమ్మి సుమారు గంట సేపు వర్షం కురిసింది. దీంతో గత కొద్దిరోజులుగా వరుణదేవుని కరుణ కోసం ఎదురుచూస్తున్న వరి, పత్తి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బైక్ చోరీపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: మోటార్‌సైకిల్ చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. స్థానిక మసీదు వెనుక ఉన్న ఎస్సీ పేటలో నివసిస్తున్న పరసా మధుబాబు అక్టోబర్ 10వ తేదీన రాత్రి తన ఇంటి వరండాలో మోటార్‌సైకిల్‌ను పార్క్ చేసి నిద్రించాడు. తరువాతి రోజు ఉదయం లేచి చూసే సరికి మోటార్‌సైకిల్ కనిపించలేదు. అప్పటినుంచి వెదికినా మోటార్‌సైకిల్ దొరకకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మద్యం విక్రేత అరెస్ట్

జంగారెడ్డిగూడెం: ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం అక్రమంగా విక్రయిస్తున్న మహిళపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వై.మంగయ్య తెలిపారు. పేరంపేటలో దాడులు నిర్వహించగా మరీదు పాటి కుమారి అక్రమంగా మద్యం విక్రయిస్తూ పట్టుబడిందన్నారు. ఆమె వద్ద నుంచి రూ.6 వేలు విలువైన 4 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై చెప్పారు.

తక్షణసాయం అందజేత

కామవరపుకోట: కామవరపుకోట శివారు కొండగూడెం గ్రామానికి చెందిన కలవకోల్లు రాంబాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతని కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణసాయంగా మట్టి ఖర్చులు నిమిత్తం రూ.10 వేలు సోమవారం అందజేశారు. మండల సచివాలయాల కన్వీనర్ పందు ప్రసన్న, సచివాలయ సెక్రటరీ బి.ప్రశాంత్, వెల్ఫేర్ అసిస్టెంట్ ఎస్.మాలతి, వార్డ్ మెంబర్ ఆడమిల్లి నాగార్జున, అందుగుల జాన్ పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్ ఆకస్మిక తనిఖీ

జంగారెడ్డిగూడెం రూరల్: కేతవరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విజిలెన్స్ కమిటీ డైరెక్టర్ పోల్నాటి బాబ్జి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం అందుతున్న తీరుపై విద్యార్థుల నుంచి ఆరా తీశారు. పాఠశాల పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ నరెడ్ల బుజ్జిబాబు, సర్పంచ్ వరదా వెంకట సత్యవతి, అక్కంపేట సర్పంచ్ పారేపల్లి నాగేంద్రబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

జంగారెడ్డిగూడెం: మద్రిగూడెం సమీపంలో ఈ నెల 4వ తేదీన జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది బాషా శ్యాంబాబుపై జరిగిన దాడిని జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. సోమవారం న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించి, నల్ల బ్యాడ్జీలు ధరించి కోర్టు ఆవరణలో నిరసన తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్యాంబాబుకు న్యాయం జరిగే వరకు పోరాటం సాగిస్తామని తెలిపారు.

కోటి లింగాలకు పూజలు

జంగారెడ్డిగూడెం: జిల్లాలో నలుమూల నుంచి తయారు చేసిన మట్టి శివ లింగాలను జంగారెడ్డిగూడెం తీసుకువచ్చి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయానందనాథ గురుసేవా సమితి సభ్యులు మాట్లాడుతూ శివసంకల్ప పీఠం సృష్టికర్త బ్రహ్మశ్రీ తంగిరాల రామచంద్ర సాయి ఆధ్వర్యంలో వారణాసిలో నవంబర్ 19 నుంచి 27వ తేదీ వరకు కాశీలో కోటి పార్థివ శివ లింగార్చన జరుపుతున్నామని తెలిపారు. తెలుగు జిల్లాల్లో 4,000 మందికి పైగా ఈ శివలింగాలను కేవలం నాలుగు నెలల్లో లింగాకారంలో తయారుచేశారన్నారు. ఆదివారంతో కోటి లింగాలు పూర్తి చేసినట్లు వివరించారు.

నవరత్నాలకు నాంది ప్రజాసంకల్ప పాదయాత్ర


జంగారెడ్డిగూడెం: గంగానమ్మ గుడిసెంటర్‌లో వైఎస్సార్‌కు నివాళి


జంగారెడ్డిగూడెం రూరల్: వేగవరంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు


కామవరపుకోట: తడికలపూడిలో వైఎస్సార్‌కు నివాళి


కొయ్యలగూడెం: వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం


లింగపాలెం: ముడిచెర్లలో వైఎస్సార్‌కు జోహార్లర్పిస్తున్న దృశ్యం


చింతలపూడి: వైఎస్సార్‌కు నివాళి అర్పిస్తున్న పార్టీ శ్రేణులు


కుక్కునూరు: కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు


పోలవరం రూరల్: కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- ఆరు వసంతాలు పూర్తి చేసుకున్న ప్రజాసంకల్ప పాదయాత్ర
- వాడవాడలా వేడుకలు నిర్వహించిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- మహానేత వైఎస్సార్‌కు ఘన నివాళి

జంగారెడ్డిగూడెం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష హోదాలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు చేపట్టిన ప్రజాసంకల్ప పాదయాత్ర ఆరు వసంతాలు పూర్తి చేసుకుంది. పాదయాత్రలో ప్రతి ఒక్కరి సమస్య తెలుసుకున్న జగనన్న.. ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన నాటినుంచి ఆ సమస్యల పరిష్కారానికి నవరత్నాల రూపంలో సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల మన్నన చూరగొన్నారు. పాదయాత్రకు శ్రీకారం చుట్టి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం వాడవాడలా వైఎస్సార్ సీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసి అందరికీ పంచారు. మహానేత వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెంలోని గంగానమ్మ గుడి సెంటర్‌లో దివంగత నేత వైఎస్సార్ కాంస్య విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, పార్టీ పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య, పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి మాట్లాడుతూ ప్రజా సంకల్ప పాదయాత్ర రాష్ట్ర భవిష్యత్తుకు నూతన అధ్యాయం వంటిదన్నారు. పాదయాత్ర ద్వారా తెలుసుకున్న ప్రతి సమస్యను జగన్‌మోహన్‌రెడ్డి ఆకళింపు చేసుకుని ముఖ్యమంత్రి అయిన వెంటనే సంక్షేమ పథకాల రూపంలో వాటిని పరిష్కరించారన్నారు. అలాగే అభివృద్ధిని సైతం మరువకుండా చేపట్టాల్సిన అన్ని కార్యక్రమాలను పారదర్శకంగా చేస్తూ భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, పామర్రు నియోజవర్గ పరిశీలకులు మండవల్లి విజయ సారథి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు విద్యాసాగర్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అక్బర్, ఏలూరు జిల్లా యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబు, జేసీఎస్ ఏలూరు జిల్లా కోఆర్డినేటర్ చింత అనిల్ కుమార్ గౌడ్, సొసైటీ మాజీ చైర్మన్ వందనపు వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ తాతకుంట్ల రవి, కౌన్సిలర్లు నేకూరి కిషోర్, సంకు సురేష్, ఉగ్గం ప్రసాద్, ఎల్‌వీఆర్, కోఆప్షన్ సభ్యులు వెంప ఐజి, ఏరియా ఆసుపత్రి డైరెక్టర్ భావన ఋషి, చిన్న తిరుపతి దేవస్థానం బోర్డ్ మెంబర్ వాస రామకృష్ణ, కటారి రాంబాబు, బత్తిన చిన్న, గెద్దాడ శ్రీను, గుబ్బల అబ్బాస్, షేక్ అమీర్, బిలాల్ మసీద్ అధ్యక్షులు షేక్ జిలాని తదితరులు పాల్గొన్నారు.

- జంగారెడ్డిగూడెం రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్ర ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం వేగవరంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పలు కార్యక్రమాలను చేపట్టింది. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కేక్ కటింగ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమ జ్యోతి, సర్పంచ్‌లు లక్కాబత్తుల నాగరాజు, గుబ్బల సత్యవేణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, సొసైటీ చైర్మన్ రాఘవరాజు ఆదివిష్ణు, ఎంపీటీసీ పోతన శ్రీను, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నులకాని సూర్యచంద్రరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం

కామవరపుకోట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. ప్రజాసంకల్పయాత్ర ఆరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తడికలపూడిలో జెడ్పీటీసీ కడిమి రమేష్, కామవరపుకోటలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడతా రమేష్ బాబు, కొండగూడెంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పందు జగదీష్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు పలు కార్యక్రమాలు నిర్వహించారు. మహానేత వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్, సర్పంచ్ కొత్తపల్లి రజని శ్రీనివాస్, ఉప సర్పంచ్ కోలా విష్ణు, పెరవలి రాజు, గంగుల వీర్రాజు, కల్లూరి గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

- కొయ్యలగూడెం: కొయ్యలగూడెం ప్రధాన సెంటర్‌లోని దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు మంతెన సోమరాజు, వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ సంకుకొండ, సచివాలయ కోఆర్డినేటర్ సూకల రాము, పార్టీ నాయకులు మద్దు గోపి, చిరవూరి శ్రీనివాస్, మారిశెట్టి శ్రీను, చిటికెన నాగార్జున, ఎస్‌కే బాజీ, ఘంటసాల మధు, మడుతూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.
- లింగపాలెం: లింగపాలెం, ముడిచెర్ల గ్రామాల్లో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ మండలపు సాయిబాబు, పార్టీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కొఠారి మోహన్, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతారావు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.
- చింతలపూడి: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు అన్నారు. ప్రజా సంకల్పయాత్ర ప్రారంభమై ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం పట్టణ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఫైర్‌స్టేషన్ సెంటర్ వద్ద ఉన్న దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, నగర పంచాయతీ సచివాలయాల కన్వీనర్ ఎన్ దుర్గారావు, పార్టీ పట్టణ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు గంధం చంటి, జగ్గవరపు శ్రీహరిరెడ్డి, ఆతుకూరి సుబ్బారావు, కాటూరి ఏలియ, శొంఠి ఖన్నా, ప్రసాద్‌రాజు, గఫూర్, దారా పేర్రాజు, ప్రకాష్, వెంకటేశ్వరరావు, బొల్లం రామారావు తదితరులు పాల్గొన్నారు.
- కుక్కునూరు: ప్రజాసంకల్ప పాదయాత్ర పూర్తి ఆరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రధాన కూడలిలోని దివంగత మహానేత డా. వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా నరసింహరాజు మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం రాష్ట్ర ప్రజలపై ఉందన్నారు. జెడ్పీటీసీ కుంజా నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ గాడిద రామచంద్రం, ఎంపీటీసీ కుండా సూరి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాదిరాజు వెంకన్నబాబు, నాయకులు పాల్గొన్నారు.
- పోలవరం రూరల్: పోలవరంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కేక్‌ను కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బుగ్గా మురళీకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఏఎంసీ డైరెక్టర్‌లు దాకే మంగాయమ్మ, షేక్ ఫాతిమున్నీసా, ఎంపీటీసీ కాశీ ధనలక్ష్మి, కరిబండి శ్రీను, కోరసిక శ్రీను, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ప్రజాసంకల్ప యాత్ర ఒక మేలిమలుపు

బుట్టాయగూడెం: రాష్ట్ర ప్రగతి, సంక్షేమానికి ప్రజాసంకల్పయాత్ర ఒక మేలిమలుపు అని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన చారిత్రాత్మక ప్రజాసంకల్ప పాదయాత్ర ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక ఆరేటి కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పంచారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర రాష్ట్ర రాజకీయాన్నే మార్చేసిందని అన్నారు. రాష్ట్రంలోని పేదల జీవితాలు మెరుగుపడేలా విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టడానికి తోడ్పడిన ప్రజా సంకల్పయాత్ర ప్రారంభించి నేటికి ఆరేళ్లు పూర్తయిందని చెప్పారు. ఎన్నికల్లో మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేరుస్తూ తిరుగులేని నేతగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించారని అన్నారు. అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ పింఛను కానుక, వైఎస్సార్ చట్ట నేస్తం, వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ రైతన్న నేస్తం, వైఎస్సార్ మత్స్యకార భరోసా, వైఎస్సార్ వాహనమిత్ర, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన వంటి పథకాలు అమలు చేయడంతోపాటు మహిళా సంఘాలకు సున్నావడ్డీ రుణాలు, నాడు–నేడు పథకంలో భాగంగా ఆస్పత్రులు, పాఠశాలల రూపురేఖలను మార్చడం జరిగిందని అన్నారు. అలాగే వైఎస్సార్ కంటి వెలుగు, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, జగనన్న విద్యాకానుకతోపాటు ఆరోగ్యశ్రీ వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా సాగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కారం శాంతి, జెడ్పీటీసీ మొడియం రామతులసి, పార్టీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గలోతు మోహన్ రావు, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, పార్టీ సీనియర్ నాయకులు, సొసైటీ అధ్యక్షుడు ఆరేటి సత్యనారాయణ, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ బాజీ, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథులు, తదితరులు పాల్గొన్నారు.


బుట్టాయగూడెంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న పోలవరం ఎమ్మెల్యే బాలరాజు, తదితరులు

విభజన హామీల అమలును విస్మరించారు

బుట్టాయగూడెం: గత నెల 30వ తేదీన మన్యప్రాంతంలోని సీతంపేటలో ప్రారంభమైన ప్రజారక్షణ భేరి ప్రచార యాత్ర సోమవారం జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాలకు చేరుకుంది. ఈ సందర్భంగా ప్రచార యాత్రలో పాల్గొన్న నాయకులకు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విభజన హామీల అమలులో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రత్యేక హోదా, పోలవరం జాతీయ ప్రాజెక్టు, కడప ఉక్కు ఫ్యాక్టరీ, రామాయపట్నం మేజర్ పోర్టు, రాజధాని నిర్మాణంపైకేంద్రం చిన్నచూపు చూస్తుందని అన్నారు.

కుక్కునూరు: సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజారక్షణ భేరి యాత్ర సోమవారం కుక్కునూరుకు చేరుకుంది. యాత్రనుద్దేశించి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ నిర్వాసితులను పోలవరం ప్రాజెక్ట్ ముంపులో ముంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయని విమర్శించారు. నిర్వాసితులకు న్యాయమైన ప్యాకేజీ ఇవ్వాలని, ఆటో కార్మికులకు కుక్కునూరు ప్రధాన సెంటర్‌లో పార్కింగ్ స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేంద్ర, అశోక్, మాడ్రాపు సూర్యనారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ రవి, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


విల్లంబులు ఎక్కు పెట్టిన సీపీఎం నాయకులు

కేసులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశం

లింగపాలెం: స్టేషన్‌కి వచ్చే ఫిర్యాదులను చట్టపరంగా తక్షణమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి పోలీసులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ధర్మాజీగూడెం పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఆమె తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. కేసుల పురోగతిపై సీఐ మల్లేశ్వరరావు, ఎస్సై పి.చెన్నారావులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్టేషన్‌లో కేసులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలన్నారు. స్టేషన్‌కి వచ్చే ప్రజలతో సిబ్బంది మర్యాదగా నడుచుకుంటూ వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని ఎస్పీ సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు, జూద క్రీడలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. ఎవరైనా అక్రమ మద్యం, నాటు సారా విక్రయాలు, తయారీకి పాల్పడితే ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ మేరీ ప్రశాంతి హెచ్చరించారు.


ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్‌ని తనిఖీ చేసిన ఎస్పీ మేరీ ప్రశాంతి

ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం


ఆరోగ్య సురక్ష కార్డు అందజేస్తున్న దృశ్యం

చింతలపూడి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం అందించాలన్న సంకల్పం దాగి ఉందని నగర పంచాయతీ కమిషనర్ ఎన్ రాంబాబు అన్నారు. నగర పంచాయతీ బోయగూడెం సచివాలయ పరిధిలో స్థానిక హైస్కూల్ ఆవరణలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, ఆరోగ్య సురక్ష కార్డులు పంపిణీ చేశారు. మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, నగర పంచాయతీ సచివాలయాల కన్వీనర్ ఎన్ దుర్గారావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, గంధం చంటి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు చర్యలు

చింతలపూడి: చింతలపూడిలో పట్టణ ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు నూజివీడు డిప్యూటి డీఎంఅండ్‌హెచ్‌ఓ డా డి ఆశ తెలిపారు. ఈ విషయంపై నగర పంచాయతీ కమిషనర్ ఎన్ రాంబాబుతో సోమవారం చర్చించారు. పట్టణ ఆరోగ్య కేంద్రం కోసం సేకరించిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట వైద్యాధికారి డా నరేష్, ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

‘స్పందన’ అర్జీలను తేలికగా తీసుకోవద్దు: ఆర్డీవో

జంగారెడ్డిగూడెం: సమస్యలు పునరావృత్తం కాకుండా అర్థవంతంగా పరిష్కరించాలని ఆర్డీవో కె.అద్దయ్య అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో సమస్యలను అధికారులు తేలికగా తీసుకోవద్దన్నారు. వచ్చిన ప్రతి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత సమయంలోనే వాటికి పరిష్కార మార్గాలు చూపాలన్నారు. సమస్య పరిష్కారం కాలేని నేపథ్యంలో అందుకు గల కారణాలను అర్జీదారుడికి తెలియపర్చాలన్నారు. అదేవిధంగా సమస్యలపై ఎండార్స్‌మెంట్ ఇవ్వడంతో పరిష్కారం అయిన సమస్యలను ఆన్‌లైన్ చేయాలన్నారు. సోమవారం నాటి స్పందన కార్యక్రమంలో మొత్తం 16 అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో తెలిపారు.

మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనం

జంగారెడ్డిగూడెం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం సరిగా లేదని, మరుగుదొడ్ల నిర్వహణ బాగాలేదని ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ఆమె పాఠశాలకు వెళ్లి పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం తిని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారం సక్రమంగా నిర్వహిస్తున్నారని, భోజన నాణ్యత బాగుందని, మరుగుదొడ్ల నిర్వహణ కూడా సక్రమంగా ఉందని చెప్పారు. వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, వైఎస్సార్ సీపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు చిటికెల అచ్చిరాజు, కమిషనర్ భవానీ ప్రసాద్, బత్తిన చిన్న హెచ్ఎం లోవకుమారి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ మహిళపై దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేయాలి

జంగారెడ్డిగూడెం: ఆదివాసీ మహిళ పూనెం పార్వతిపై దాడి చేసిన న్యాయవాది బాషా రంపాల శ్యామ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ డిమాండ్ చేసింది. జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించి అనంతరం ఆర్డీవో అద్దయ్యకు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ మద్రిగూడెంలో పూనెం పార్వతి, పొట్టి బెల్లమ్మ కూలికి వెళ్లి తిరిగి వస్తుండగా, బాషా రంపాల శ్యామ్, కొందరు కలిసి పార్వతిపై దాడి చేశారన్నారు. కత్తులతో, కర్రలతో ఆమెను విచక్షణ రహితంగా కొట్టి గాయపరిచారన్నారు. న్యాయవాది బాషా రంపాల శ్యామ్‌ను అరెస్టు చేయాలని, అడ్వకేట్ వృత్తి నుంచి తొలగించాలని, బార్ అసోసియేషన్ సభ్యత్వం రద్దు చేయాలని న్యూడెమోక్రసీ నాయకులు డిమాండ్ చేశారు.

బాణసంచా దుకాణదారులు నిబంధనలు పాటించాలి

పోలవరం రూరల్: బాణసంచా దుకాణదారులు నిబంధనలు పాటించాలని తహసీల్దార్ బి.సుమతి సూచించారు. దీపావళి బాణసంచా విక్రయించే దుకాణ యజమానులతో సోమవారం పోలవరం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ నివాసాలకు నిర్దేశించిన దూరంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలతో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాన్నారు. అగ్నిప్రమాద నివారణ సామాగ్రిని కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అలాగే కార్తీకమాసం ప్రారంభం కానున్న దృష్ట్యా భక్తులు గోదావరి నది స్నానానికి వెళ్లేందుకు రేవుల వద్ద కూడా నిర్దేశించిన నియమ నింబధనలు ఏర్పాటు చేయాలన్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.శ్రీను, ఏఎస్సై కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రైతుల నిరసన

పోలవరం రూరల్: కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పోలవరం బస్టాండ్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. న్యూస్ క్లిక్ ఎఫ్ఐఆర్ కాపీలను దగ్ధం చేసి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ న్యూస్ క్లిక్ ఎఫ్ఐఆర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని, అరెస్టయిన జర్నలిస్టులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ రైతు ఉద్యమంపై బురదచల్లే కార్యక్రమం మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం గిరిజన సంఘం నాయకులు బొరగం భూ చంద్రరరావు, జి.వెంకట్రావు, సముద్రాల సాయికృష్ణ, మడివి చలపతిరావు, మిడియం గంగాదేవి తదిరులు పాల్గొన్నారు.